సాక్షి విశాఖపట్నం

గురువారం । 9 । అక్టోబర్ । 2025



మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో 60 శాతం నిర్మాణం పూర్తయిన మెడికల్ కాలేజీ భవనం

మాజీ సీఎం జగన్ పర్యటన ఇలా..



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గురువారం ఉదయం 10 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి ఎన్‌ఏడీ జంక్షన్, గోపాలపట్నం, పెందుర్తి, సబ్బవరం–అనకాపల్లి జాతీయ రహదారి మీదుగా కొత్తూరు జంక్షన్.. అక్కడ నుంచి తాళ్లపాలెం జంక్షన్ మీదుగా మాకవరపాలెం మండలంలో భీమబోయినపాలెం మెడికల్ కళాశాలకు చేరుకుంటారు. అక్కడ కళాశాలను పరిశీలించి మధ్యాహ్నం 1.30 నుంచి 2.15 గంటల వరకు మీడియాతో మాట్లాడతారు. అనంతరం విశాఖలో గల కేజీహెచ్‌కు నాలుగు గంటలకు చేరుకుంటారు. కురుపాం గిరిజన ప్రభుత్వ వసతి గృహంలో అస్వస్థతకు గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న గిరిజన బాలికలను పరామర్శిస్తారు. విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి సాయంత్రం ఆరు గంటలకు తిరుగు ప్రయాణమవుతారు.

నర్సీపట్నం వైద్య కళాశాలపై.. కూటమి కత్తి!

- 2022 డిసెంబర్ 30న ప్రభుత్వ మెడికల్ కాలేజీకి శంకుస్థాపన
- రూ.500 కోట్లు కేటాయించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- 50 ఎకరాల్లో 13.21 లక్షల చ.అ. విస్తీర్ణంలో భవన నిర్మాణం
- గత ప్రభుత్వ హయాంలో నిర్మాణ పనులు పరుగులు
- కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ పనులకు బ్రేకులు
- కాలేజీని పీపీపీ పేరుతో ప్రైవేటుకు అప్పగించాలని కుట్రలు



2022 డిసెంబర్ 30న నర్సీపట్నం మెడికల్ కాలేజీకి శంకుస్థాపన చేస్తున్న నాటి సీఎం వై.ఎస్.జగన్

విశాఖ సిటీ: రాష్ట్రంలో అన్ని జిల్లాలను కలుపుతూ ఒక మెడికల్ సర్క్యూట్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే గత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడిచేందుకు సిద్ధమైంది. ప్రతి జిల్లాలో ఒక ప్రభుత్వ వైద్య కళాశాల ఉండాలన్న గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యాన్ని కాలరాసే పన్నాగాలు పన్నుతోంది. పేదలకు వైద్య విద్యతో పాటు.. అత్యాధునిక వైద్య సదుపాయాలు అందించేందుకు గతంలో శ్రీకారం చుడితే.. కూటమి ప్రభుత్వం వాటిని పీపీపీ పేరుతో ప్రైవేటుకు కట్టబెట్టేందుకు కుట్ర చేస్తోంది. పేద, బడుగు, బలహీన వర్గాలకు వైద్య విద్య, వైద్యాన్ని దూరం చేయాలని కంకణం కట్టుకుంది. 2022 డిసెంబర్ 30న అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నర్సీపట్నంలో మెడికల్ కాలేజీ పనులకు శంకుస్థాపన చేయగా.. ప్రతిపక్షంలో ఉన్నప్పటి నుంచి ఈ కళాశాల నిర్మాణాన్ని అడ్డుకోవడానికి చంద్రబాబు అండ్ కో విశ్వప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

అడుగడుగునా అడ్డంకులు సృష్టి

రాష్ట్రంలో కొత్తగా 17 ప్రభుత్వ వైద్య కళాశాలలకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం శ్రీకారం చుడితే వాటిని అడ్డుకోవడానికి చంద్రబాబు గ్యాంగ్ తీవ్ర ప్రయత్నాలు చేసింది. ప్రధానంగా అనకాపల్లి జిల్లాలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయకుండా అడుగడుగునా అడ్డంకులు సృష్టించింది. తొలి విడతలో అనకాపల్లి టౌన్‌లో ఏర్పాటుకు 50 ఎకరాల స్థలాన్ని కేటాయించగా.. స్థానిక టీడీపీ నేతలు న్యాయస్థానాల ద్వారా అడ్డుకున్నారు. దీంతో అనకాపల్లి నుంచి నర్సీపట్నం నియోజకవర్గానికి వైద్య కళాశాలను తరలించాల్సి వచ్చింది. ఈ మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తయితే గ్రామీణ ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. అలాగే ఏటా 150 ఎంబీబీఎస్ సీట్లలో విద్యార్థులకు ప్రవేశం లభిస్తుంది. తర్వాత పీజీ వైద్య కోర్సులు వస్తాయి. తద్వారా పీజీ వైద్య విద్యార్థులు, వారికి వైద్య విద్య బోధించే ప్రొఫెసర్లు (నిపుణులైన వైద్యులు) అందుబాటులోకి వస్తారు. వారు ప్రభుత్వ ఉద్యోగులు కాబట్టి అక్కడే నివాసం ఉండాల్సి ఉంటుంది. దీంతో గ్రామీణ ప్రజలకు 24 గంటలూ అత్యవసర వైద్యం అందుతుంది. కానీ ఈ ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంలో ప్రైవేటుకు అప్పగించాలని నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో వాటిని కౌంటర్ చేయలేక కిందామీదా పడుతోంది. ఇది కూటమికి ప్రతికూల ప్రభావాన్ని చూపించే అవకాశం ఉండడంతో అసలు వైద్య కాలేజీ నిర్మాణాలే జరగలేదని మంత్రులు అబద్ధాలకు తెరతీశారు.

వందేళ్ల తర్వాత ప్రభుత్వ వైద్య కళాశాల

ఉత్తరాంధ్రలో 1921లో ఆంధ్రా మెడికల్ కాలేజీ ఏర్పాటైంది. వందేళ్ల తర్వాత గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నర్సీపట్నం, పాడేరుల్లో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో మెడికల్ కాలేజీ నిర్మాణానికి రూ.500 కోట్లు కేటాయించింది. 2022 డిసెంబర్ 30న అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2025 నాటికి పూర్తి చేయాలనే సంకల్పంతో 50.15 ఎకరాల్లో 13.21 లక్షల చ.అ. విస్తీర్ణంలో నిర్మాణ పనులు ప్రారంభించారు. ఏటా 150 ఎంబీబీఎస్ సీట్ల అడ్మిషన్లు చేపట్టాలని నిర్ణయించారు. వైఎస్సార్ సీపీ హయాంలోనే మెడికల్ కాలేజీ, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, నర్సింగ్ కాలేజీ, ఇతర భవనాల నిర్మాణాలు జోరుగా సాగాయి. ఫుటింగ్ దశలో భవనాలు ఉండగా.. ఐటీడీ బ్లాక్, 24X7 బ్లాక్ శ్లాబ్ వేయడం జరిగింది. మార్చురీ బ్లాక్, మెడికల్ గ్యాస్ ప్లాంట్, బయోమెడికల్ గ్యాస్ ప్లాంట్, లాండ్రీ, ఆసుపత్రి కిచెన్ పనులు వేగంగా జరిగాయి. దాదాపు 60 శాతానికి పైగా నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ కాలేజీ నిర్మాణాలకు బ్రేకులు పడ్డాయి.

అయ్యన్నా.. ఇదిగో జీవో



నర్సీపట్నం మెడికల్ కాలేజ్ జీవో

నర్సీపట్నంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీకి జీవో కూడా లేదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అవాస్తవాన్ని వల్లెవేశారు. ఆ జీవో ఉంటే చూపించాలని సవాల్ విసిరారు. అయితే నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నర్సీపట్నంలో ప్రభుత్వ కాలేజీకి రూ.500 కోట్లు మంజూరు చేస్తూ 2022 ఆగస్టు 8న జీవో నెంబర్ 204ను విడుదల చేసింది. అంతకుముందు అనకాపల్లిలో ఏర్పాటు కోసం 2020 ఆగస్టు 24న జీవో నెంబర్ 374ను, 2021 మార్చి 23న జీవో నెంబర్ 33ను విడుదల చేసింది. ఈ జీవో ఆన్‌లైన్‌లోనే అందుబాటులో ఉన్నప్పటికీ అయ్యన్నపాత్రుడు వక్రీకరించి జీవో లేదని అబద్ధాలు చెప్పడం గమనార్హం. జీవో ఉంటే చూపించాలని సవాల్ విసిరిన అయ్యన్నకు ఇప్పుడు వైఎస్సార్ సీపీ శ్రేణులు సోషల్ మీడియాలో వాటిని సర్క్యులేట్ చేస్తున్నారు. దీనిపై అయ్యన్న ఏం సమాధానం చెబుతారని ప్రశ్నలు సంధిస్తున్నారు.

జగన్ పర్యటనకు ఆటంకాలు సృష్టిస్తే తీవ్ర పరిణామాలు తప్పవు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు



మాట్లాడుతున్న కేకే రాజు. చిత్రంలో విశాఖ పార్లమెంట్ పరిశీలకుడు కదిరి బాబూరావు

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనకు ఆటంకాలు సృష్టిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు హెచ్చరించారు. చట్టం పరిధిలోనే పోలీసులు, అధికారులు పనిచేయాలని, అలా కాకుండా అత్యుత్సాహం ప్రదర్శిస్తే రానున్న కాలంలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. అధినేత పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కె.కె.రాజు పిలుపునిచ్చారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో విశాఖ పార్లమెంట్ పరిశీలకుడు కదిరి బాబూరావుతో కలిసి బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'మా ప్రభుత్వ హయాంలో రూ.8 వేల కోట్లతో పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందాలనే ముందుచూపుతో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టాం. వాటి ప్రైవేటీకరణకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వం తీరుపై పోరాటం చేస్తున్నాం. ప్రజా నాయకుడు వైఎస్ జగన్ పర్యటనను అడ్డుకోవడం కాదు... దమ్ముంటే ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కొనసాగించి పేదలకు ఉచితంగా వైద్యం అందించే ప్రయత్నాలు చేయండి. అప్పుడు ప్రజల మనసులు గెలుచుకుంటారు.' అని కూటమి నేతలకు హితవు పలికారు. నర్సీపట్నం మెడికల్ కాలేజీకి అనుమతి లేదంటూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు కళ్లుండీ కబోదిలా మాట్లాడారు.. అనుమతి ఇవ్వకుండా పోలీసులు రూట్లను మార్చి, ఫ్లెక్సీలు కూడా కట్టనివ్వకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. అనుమతి ఇచ్చినా, ఇవ్వకపోయినా జగన్ నర్సీపట్నం వెళ్లడం ఖాయమన్నారు. 'ఉత్తరాంధ్ర అభివృద్ధిని వైఎస్ జగన్ ఆకాంక్షించారు. స్వాగత ఏర్పాట్లను కూడా అధికారులు అడ్డుకుంటున్నారు. చంద్రబాబు ఉత్తరాంధ్రను నాశనం చేస్తున్నారు. ఇక్కడి భూములను, సంపదను దోచుకు తింటుంటే నోరు మూసుకొని ఉండటం సిగ్గు చేటు. ఉత్తరాంధ్ర కూటమి నేతలకు సిగ్గు, శరం ఉంటే చంద్రబాబు చేస్తున్న అన్యాయాలను ప్రశ్నించండి' అంటూ మండిపడ్డారు. కదిరి బాబూరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి, ఆ సమస్యలపై పోరాటం చేసేందుకు వస్తున్న మాజీ సీఎం పర్యటనకు ఆటంకాలు సృష్టించడం దుర్మార్గమన్నారు. చంద్రబాబు ఒక్క ప్రభుత్వ మెడికల్ కాలేజీ కూడా తీసుకురాలేదు... అలాంటి వ్యక్తి జగన్ తీసుకొచ్చిన కాలేజీలను ప్రైవేటుకు ఇవ్వడం దుర్మార్గమన్నారు. ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని, చంద్రబాబు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదంటూ హెచ్చరించారు.

హ్యాట్రిక్‌పై భారత్ కన్ను

8లో

నేడు దక్షిణాఫ్రికాతో అమీతుమీ
మధ్యాహ్నం 3 గంటలకు మ్యాచ్



విద్యార్థినుల ఆరోగ్యంతో ఆటలా?

- నీరసంగా ఉన్నా పార్వతీపురం పీహెచ్‌సీకి వెళ్లాలని డిశ్చార్జ్
- మాజీ సీఎం జగన్ పరామర్శించకూడదనే కుట్రలు
- కేజీహెచ్‌లో మొత్తం 64 మంది చేరగా.. ఇప్పటికే 18 మంది డిశ్చార్జ్
- ఈ ఉదయం మరో 10 మందిని పంపించేందుకు సన్నాహాలు
- బాధిత విద్యార్థినుల ఆహారం విషయంలోనూ అదే నిర్లక్ష్యం



బుధవారం రాత్రి కేజీహెచ్ నుంచి డిశ్చార్జ్ చేసిన విద్యార్థినులు

సాక్షి, విశాఖపట్నం : కూటమి ప్రభుత్వం అంతులేని నిర్లక్ష్యం కారణంగా.. ఇప్పటికే ఇద్దరు విద్యార్థినుల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. వంద మందికి పైగా విద్యార్థినులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అయినా ప్రభుత్వంలో కించెత్తు పశ్చాత్తాపం కనిపించలేదు. చికిత్స పొందుతున్న విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యతని విస్మరిస్తోంది. వైద్యం అందించడంలోనూ రాజకీయం చేస్తోంది. విశాఖలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటన ఖరారవ్వడం.. పచ్చకామెర్లతో బాధపడుతున్న విద్యార్థులను పరామర్శించేందుకు వస్తున్నారని తెలుసుకున్న ప్రభుత్వం ..విద్యార్థుల ఆరోగ్యంతో ఆడుకుంటోంది. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో పూర్తిగా నయమవ్వకుండానే విద్యార్థినులను కేజీహెచ్ నుంచి డిశ్చార్జ్ చేసేస్తున్నారు. బాబ్బాబూ.. పాప ఇంకా నీరసంగా ఉందయ్యా.. అని వేడుకుంటున్నా.. కేజీహెచ్‌లో వద్దు.. పార్వతీపురం పీహెచ్‌సీకి వెళ్లిపోండంటూ పంపించేస్తున్నారు.

ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నా..

పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలోని ఏకలవ్య పాఠశాల, దానిని ఆనుకొని ఉన్న గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహంలో విషజ్వరాలు ప్రబలి ఇద్దరు విద్యార్థినులు మృత్యు ఒడికి చేరుకున్నారు. 120 మందికి పైగా ఆస్పత్రుల పాలయ్యారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో కురుపాం, పార్వతీపురం ఆస్పత్రుల నుంచి కేజీహెచ్‌కు 64 మంది విద్యార్థులను తరలించారు. ఆ సమయంలో వీరందరి ఆరోగ్యం కూడా కాస్తా విషమంగా ఉండింది. ప్రతిరోజూ వైఎస్సార్ సీపీ నేతలు పరామర్శించి.. వైద్య సహాయక చర్యలపై ఆరా తీసిన తర్వాతే... విద్యార్థులకు వైద్య సేవలు ముమ్మరం చెయ్యడం ప్రారంభించారు. దీంతో పిల్లలు ఇప్పుడిప్పుడే కాస్తా కోలుకుంటున్నారు.

ఆహారం విషయంలోనూ..

బాధిత విద్యార్థినుల ఆహారం విషయంలోనూ అదే నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారు. పచ్చకామెర్లతో బాధపడుతున్న వారికి తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారం ఇవ్వాలి. కానీ కేజీహెచ్‌లో ప్రతిరోజూ అందరికీ అందించే ఉప్మా ఇచ్చారు. హోం మంత్రి అనిత పరామర్శించిన సమయంలో బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో.. తర్వాత నుంచి ప్రత్యేక మెనూ ఇస్తున్నారు. మొత్తానికి తమ రాజకీయం కోసం.. విద్యార్థుల ఆరోగ్యాన్ని కూడా కూటమి ప్రభుత్వం లెక్కచేయకపోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

వైఎస్ జగన్ వస్తున్నారని..!

కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను గురువారం సాయంత్రం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శిస్తారని తెలిసినప్పటి నుంచి కూటమి ప్రభుత్వానికి భయం పట్టుకుంది. కురుపాం ఘటనను బాహ్య ప్రపంచానికి తెలియకుండా మాఫీ చేసేందుకు ప్రభుత్వం యతిన్నించినా బట్టబయలైంది. ఇక వైఎస్ జగన్ వస్తే.. జాతీయ స్థాయి ఇష్యూగా మారుతుందనే ఆందోళన ప్రభుత్వంలో కనిపించింది. దీంతో విద్యార్థినుల ఆరోగ్యంతో చెలగాటమాడేందుకు కూడా వెనుకాడటం లేదు. హోంమంత్రి, ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో నీరసంగా ఉన్నా కనికరించకుండా విద్యార్థినులను కేజీహెచ్ నుంచి డిశ్చార్జ్ చేయడం మొదలుపెట్టారు. మంగళవారం రాత్రి 8 మందిని, బుధవారం రాత్రి ఆదరాబాదరాగా మరో 10 మందిని పంపించేశారు. ప్రస్తుతం 46 మంది ఇక్కడ చికిత్స పొందుతున్నారు. శుక్రవారం ఉదయంలోపు మరో 10 మందిని పంపించేందుకు డిశ్చార్జ్ షీట్స్ సిద్ధం చేస్తున్నారు. పాప నీరసంతో నడవలేకపోతోంది.. రెండు రోజులు ఇక్కడ ఉంచాలని తల్లిదండ్రులు కోరుతున్నా.. ఏం ఫర్వాలేదు.. మీరు కురుపాం పీహెచ్‌సీలో జాయిన్ అవ్వండంటూ డిశ్చార్జ్ షీట్‌లో రాసి మరీ పంపించేస్తుండటం దారుణం. వైద్యసేవలు పూర్తిగా అందించకుండానే డిశ్చార్జ్ చేస్తుండటంతో తల్లిదండ్రులు, బాధిత విద్యార్థినులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏయూ సెల్ఫ్-ఫైనాన్స్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో 2025–26 విద్యా సంవత్సరానికి గానూ పలు సెల్ఫ్–ఫైనాన్స్ పీజీ, డిప్లమో కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డి.ఎ.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మాస్టర్ ఆఫ్ హాస్పిటాలిటీ అడ్మినిస్ట్రేషన్ కోర్సు కాల వ్యవధి రెండేళ్లు, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు. 40 సీట్లు ఉన్నాయి. ఫీజు రూ. 55,000. ఒక ఏడాది పీజీ డిప్లమో ఇన్ క్రిటికల్ కేర్ కోర్సుకు ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ ఫార్మసీ, నర్సింగ్, బీహెచ్ఎంఎస్ లేదా బీఎస్సీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు. 15 సీట్లు భర్తీ చేస్తారు. ఫీజు రూ.60,000. పీజీ డిప్లమో ఇన్ ఎమర్జెన్సీ మెడిసిన్ టెక్నాలజీ కోర్సు కాలవ్యవధి ఒక ఏడాది. ఎంబీబీఎస్ లేదా సంబంధిత వైద్య డిగ్రీలు చేసిన వారు అర్హులు. 15 సీట్లను భర్తీ చేస్తారు. ఫీజు రూ.60,000. ఒక ఏడాది పీజీ డిప్లమో ఇన్ గ్యాస్ట్రోఎంటరాలజీ కోర్సులో చేరేందుకు ఎంబీబీఎస్ లేదా సంబంధిత వైద్య డిగ్రీలు ఉండాలి. 15 సీట్లను భర్తీ చేస్తారు. ఫీజు రూ.40,000. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు పూర్తి వివరాలకు ఏయూ అడ్మిషన్స్ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

కట్టమంచికి అవమానం

- స్నాతకోత్సవం చరిత్రలో తొలిసారి వేదిక మార్పు
- కన్వెన్షన్ సెంటర్‌కు తరలింపుపై అభ్యంతరాలు
- తీవ్ర వ్యతిరేకతతో వెనక్కి తగ్గిన ఏయూ అధికారులు



విశాఖ సిటీ: ప్రతిష్టాత్మక ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పాలకవర్గం తీసుకుంటున్న నిర్ణయాలు వివాదాస్పదమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏయూ పాలనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే హాస్టళ్లలో సమస్యలు, పురుగుల భోజనం, విద్యార్థి మరణం వంటి అనేక వివాదాలు చుట్టుముట్టగా, తాజాగా స్నాతకోత్సవ వేదిక మార్పు అంశం అగ్గి రాజేస్తోంది. ఆంధ్రా యూనివర్సిటీ తొలి ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి(సీఆర్ రెడ్డి)ని అగౌరవపరిచేలా ఏయూ అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని వర్సిటీ వర్గాలు తీవ్రంగా తప్పుబడుతున్నాయి. కట్టమంచికి గౌరవార్థంగా ఏయూలో నిర్మించిన 'కట్టమంచి రామలింగారెడ్డి ఉత్సవ రంగం (కాన్వొకేషన్ హాల్)'లోనే పట్టభద్రుల పట్టాల పండగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే.. చరిత్రలో తొలిసారిగా స్నాతకోత్సవం వేదికను మార్చాలనే నిర్ణయంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

కట్టమంచి నుంచి కన్వెన్షన్ సెంటర్‌కు..

ఏయూలో ఈ నెల 15న 91వ, 92వ స్నాతకోత్సవాలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. రెండేళ్ల పట్టభద్రులకు ఒకేసారి పట్టాలు అందించాలని నిర్ణయించారు. ఎప్పటిలాగే కట్టమంచి రామలింగారెడ్డి ఉత్సవ రంగం హాల్‌లో కాన్వొకేషన్ జరుగుతుందని అందరూ భావించారు. అయితే.. ఈ స్నాతకోత్సవాన్ని అక్కడి నుంచి బీచ్‌రోడ్డులో ఉన్న ఏయూ కన్వెన్షన్ సెంటర్‌కు మార్చినట్లు అధికారులు ప్రకటించారు. దీనిపై ఏయూలో పలు వర్గాల నుంచి అభ్యంతరాలు వచ్చాయి. స్నాతకోత్సవాన్ని ఉత్సవ రంగంలో కాకుండా వేరే చోట నిర్వహించడం కట్టమంచిని అవమానించడమే అన్న అభిప్రాయాలు బలంగా వ్యక్తమయ్యాయి. ఈ అంశంపై తీవ్ర వ్యతిరేకత రావడంతో.. కట్టమంచి రామలింగారెడ్డి ఉత్సవ రంగం హాల్ మరమ్మతులకు గురైందన్న సాకును అధికారులు తెరపైకి తీసుకొచ్చారు. ఇప్పటివరకు జరిగిన అన్ని స్నాతకోత్సవాలు అక్కడే జరిగాయి. తాజాగా 91వ, 92వ కాన్వొకేషన్‌ను నిర్వహించాలని నిర్ణయించినప్పుడు, ఈలోపే మరమ్మతులు ఎందుకు పూర్తి చేయలేదన్న ప్రశ్నలను ఏయూలో కొందరు సంధిస్తున్నారు. ఏయూ ప్రారంభం నుంచి వస్తున్న సంప్రదాయానికి విరుద్ధంగా వ్యవహరించడాన్ని తప్పుబడుతున్నారు.

ఆలస్యంగా మరమ్మతులు

కట్టమంచి రామలింగారెడ్డి ఉత్సవ రంగం హాల్ మరమ్మతులకు గురైన మాట వాస్తవమే. పైన సీలింగ్ ఊడి పడే ప్రమాదం ఉంది. 91వ, 92వ కాన్వొకేషన్ నిర్వహించాలని నిర్ణయించడానికి ముందే ఈ మరమ్మతులను పూర్తి చేయాల్సి ఉంది. కానీ ఆ పని చేయలేదు. ఇదిలా ఉండగా, ఇటీవల ఇందులో పనిచేస్తున్న కార్మికుడొకరు పై నుంచి కిందపడి మరణించారు. దీంతో పోలీసులు తాత్కాలికంగా పనులు నిలిపివేసినట్లు తెలుస్తోంది. ఫలితంగా మరమ్మతు పనులు మరింత ఆలస్యమయ్యాయి.

ఏయూ ఆరోగ్య కేంద్రానికి వైద్యులు

సాక్షి ఎఫెక్ట్..

విశాఖ సిటీ : ఎట్టకేలకు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆరోగ్య కేంద్రంలో పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టారు. నిత్యం 200 మంది వరకు రోగులు వచ్చే ఈ కేంద్రానికి వైద్యులు, సిబ్బంది లేక వైద్య సదుపాయాలు సక్రమంగా అందడం లేదు. ఇటీవలే బీఈడీ విద్యార్థి ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడినప్పటికీ ఆక్సిజన్ పెట్టకపోవడంతో మరణించాడు. దీనిపై విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఏయూ ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది లేకపోవడంపై 'ఆక్సిజన్ పెట్టేవారే లేరు' అనే శీర్షికను 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనిపై ఏయూ అధికారులు స్పందించారు. కొత్తగా ఏడాది కాలానికి వైద్యులు, సిబ్బందిని నియమించారు.

ఏళ్లుగా అరకొర సేవలు : ఏయూలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర, ఇతర సిబ్బంది, విద్యార్థుల కోసం ఆరోగ్య కేంద్రం ఉంది. 24 గంటల పాటు ఇక్కడ వైద్య సేవలు అందించాల్సిన ఈ డిస్పెన్సరీలో కేవలం ఇద్దరేసి చొప్పున వైద్యులు, నర్సులు, ఫార్మసిస్టులు మాత్రమే ఉన్నారు. మూడు షిఫ్టులలో పనిచేసే ఈ ఆరోగ్య కేంద్రానికి నిత్యం ఓపీకి 200 మంది రోగులు వరకు వస్తున్నారు. అరకొర సిబ్బందితో వైద్య సేవలు అందిస్తూ ఉన్నారు. గత నెల 25వ తేదీన బీఈడీ విద్యార్థి మరణంతో ఏయూ విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. డిస్పెన్సరీలో వైద్య సేవలు అందించడానికి సిబ్బంది లేని కారణంగా విద్యార్థి చనిపోయినట్లు వారు ఆరోపించారు. దీనిపై ఏయూ ఆరోగ్య కేంద్రం పరిస్థితులపై సాక్షి కథనంతో ఏయూ అధికారులతో కదలిక వచ్చింది. కొత్తగా సిబ్బంది భర్తీకి కొద్ది రోజుల క్రితమే నోటిఫికేషన్ విడుదల చేశారు. తాజాగా ఈ ఆరోగ్య కేంద్రానికి ముగ్గురు వైద్యులు, నలుగురు ఫార్మసిస్టులు, ముగ్గురు స్టాఫ్ నర్సుల నియామకాన్ని చేపట్టారు.



ఏయూ ఆరోగ్య కేంద్రం

పెల్లుబికిన ప్రజాగ్రహం

- 'అంబుజా' గో బ్యాక్ అంటూ నినాదాలు
- ప్రజాభిప్రాయ సేకరణ అడ్డగింత

8లో



బారికేడ్లను తొలగించి దూసుకువస్తున్న జనం

ఎన్-బ్రాండ్‌తో ప్రజల ప్రాణాలకు ముప్పు

8లో



కల్తీ మద్యం అరికట్టాలని నినాదాలు చేస్తున్న వైఎస్సార్ సీపీ మహిళా నేతలు

ఏయూ రెక్టార్‌గా ఆచార్య కింగ్



వీసీ నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న ఆచార్య కింగ్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్‌గా కెమికల్ ఇంజినీరింగ్ విభాగం సీనియర్ ఆచార్యులు పులిపాటి కింగ్ నియమితులయ్యారు. ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ బుధవారం ఆచార్య కింగ్‌కు నియామక ఉత్తర్వులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆచార్య కింగ్ రెక్టార్‌గా బాధ్యతలు స్వీకరించారు. కెమికల్ ఇంజినీరింగ్ విభాగం సీనియర్ ఆచార్యులుగా ఉన్న ఆచార్య కింగ్ గతంలో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్స్ చీఫ్ వార్డెన్‌గా, కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా, కెమికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా తదితర పదవులను నిర్వహించారు. ఆయన ఏయూ నుంచి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉత్తమ అకడమీషియన్ అవార్డును, అమెరికాకు చెందిన అండన్ ఫౌండేషన్ టీచింగ్ ఎక్సలెన్స్ అవార్డును కూడా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్య కింగ్‌కు వర్సిటీ ఆచార్యులు శుభాకాంక్షలు తెలిపారు.

జేఎన్‌టీయూ గురజాడ వర్సిటీ వీసీగా సుబ్బారావు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం యూనివర్సిటీ ఉపకులపతిగా జేఎన్‌టీయూకే మెకానికల్ ప్రొఫెసర్ వీ.వీ.సుబ్బారావును నియమిస్తూ బుధవారం ఉన్నత విద్య కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈయన గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ రిజిస్ట్రార్‌గా, ప్రస్తుతం రెక్టార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీకి గతంలో అనుబంధంగా ఉన్న విజయనగరం ఇంజినీరింగ్ కళాశాలను యూనివర్సిటీగా ఏర్పాటు చేసి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లా పరిధిని ఈ వర్సిటీకి అనుబంధం చేశారు.

ఏయూ స్నాతకోత్సవం వాయిదా

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ 91, 92 సంయుక్త స్నాతకోత్సవాన్ని వాయిదా వేసినట్లు రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న బీచ్ రోడ్డులో ఉన్న ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ స్నాతకోత్సవాన్ని నిర్వహించాల్సి ఉండగా.. తాత్కాలికంగా వాయిదా వేసినట్లు చెప్పారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలో వెల్లడిస్తామన్నారు.

రేపు అండర్-14 క్రికెట్ బాలుర జట్టు ఎంపిక

ఆరిలోవ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్యాలెండర్ ప్రకారం, ఉమ్మడి విశాఖ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10న అండర్-14 క్రికెట్ బాలుర జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో ఎస్.ప్రేమ కుమార్ తెలిపారు. వీఎంఆర్డీఏ పార్కు వద్ద ఉన్న వైజాగ్ క్రికెట్ అకాడమీలో ఉదయం 8 గంటలకు ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. 2012 జనవరి 1 తర్వాత జన్మించిన విద్యార్థులు ఎంపిక పోటీలకు అర్హులని, 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. అయితే ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యా సంస్థల్లో చదువుతుండాలని స్పష్టం చేశారు. విద్యార్థులు సొంత కిట్లు, క్రికెట్ డ్రెస్‌తో హాజరు కావాలని, మరిన్ని వివరాలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ టి.నాగేశ్వరరావును 90000 19048లో సంప్రదించాలని డీఈవో సూచించారు.

హ్యాట్రిక్‌పై భారత్ కన్ను

- నేడు దక్షిణాఫ్రికాతో అమీతుమీ
- విశాఖలో తొలి సమరానికి సర్వం సిద్ధం



ప్రాక్టీస్ చేస్తున్న దక్షిణాఫ్రికా ఆటగాళ్లు









సాధన చేస్తున్న భారత క్రీడాకారిణి

విశాఖ స్పోర్ట్స్/పీఎంపాలెం: విశాఖ నగరంలో క్రికెట్ సందడి నెలకొంది. అంతర్జాతీయ మహిళా క్రికెట్‌కు తొలిసారిగా వేదికగా నిలిచిన సందర్భంలో.. నగరం మొత్తం ఉత్కంఠతో ఎదురుచూస్తోంది. ఐసీసీ మహిళల ప్రపంచ కప్‌లో భాగంగా.. హ్యాట్రిక్ విజయం లక్ష్యంగా భారత జట్టు గురువారం పటిష్టమైన దక్షిణాఫ్రికాతో తలపడనుంది. పీఎంపాలెంలోని వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ డే అండ్ నైట్ వన్డే మ్యాచ్ కోసం సర్వం సిద్ధమైంది. ఇప్పటికే ఇరు జట్లు స్టేడియంలో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ప్రాక్టీస్ చేసుకున్నాయి.

విజయోత్సాహంతో బరిలోకి భారత్

ప్రస్తుత టోర్నీలో భారత జట్టు అద్భుతమైన ఫామ్‌లో ఉంది. ఆడిన తొలి రెండు మ్యాచ్‌ల్లో శ్రీలంకపై 59 పరుగులు, చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌పై 88 పరుగుల భారీ తేడాతో ఘన విజయాలు సాధించింది. విశాఖ వేదికగా అదే జోరును కొనసాగించాలని కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ సేన పట్టుదలగా ఉంది. బ్యాటింగ్‌లో హర్లీన్(94 పరుగులు), దీప్తి శర్మ (78 పరుగులు), ప్రతీక (68 పరుగులు) సూపర్ ఫామ్‌లో ఉండగా, బౌలింగ్‌లోనూ దీప్తి శర్మ (6 వికెట్లు), క్రాంతి, స్నేహ రాణా (చెరో 4 వికెట్లు) ప్రత్యర్థులకు సింహస్వప్నంలా మారారు. బ్యాటింగ్‌కు స్వర్గధామమైన విశాఖ పిచ్‌పై వీరు మరింతగా రాణిస్తారని అభిమానులు ఆశిస్తున్నారు.

అభిమానుల కోలాహలం

విశాఖ మహిళల ప్రపంచ కప్ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వడం ఇదే ప్రప్రథమం. దీంతో నగర క్రీడాభిమానుల్లో ఉత్సాహం కనిపిస్తోంది. భారత్, దక్షిణాఫ్రికాతో పాటు ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ వంటి దిగ్గజ జట్లు ఇక్కడ ఆడనుండటంతో స్టేడియం పరిసరాల్లో పండగ వాతావరణం నెలకొంది. స్థానిక యువ క్రీడాకారిణులను ప్రోత్సహించే దిశగా స్టేడియంలోని ఒక స్టాండ్‌కు భారత మహిళా క్రికెట్ దిగ్గజం, హైదరాబాదీ మిథాలీ రాజ్ పేరు, ఒక ప్రవేశ ద్వారానికి ఆంధ్ర క్రీడాకారిణి కల్పన పేరు పెట్టడం విశేషం. ఇది భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తుందని నిర్వాహకులు భావిస్తున్నారు.

భారీ బందోబస్తు..

ఈ ప్రతిష్టాత్మక మ్యాచ్‌కు ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వాహకులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. స్టేడియం లోపల, వెలుపల సుమారు 1,100 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపారు. ప్రతి ప్రవేశ ద్వారం వద్ద సీఐ స్థాయి అధికారి పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. మరోవైపు, వరుణుడు అంతరాయం కలిగించే అవకాశం ఉన్నప్పటికీ.. స్టేడియంలో ఉన్న ఆధునిక డ్రైనేజీ వ్యవస్థతో వర్షం నీరు త్వరితగతిన బయటకు వెళ్లే ఏర్పాట్లు ఉన్నాయి. ఎడతెరిపి లేకుండా వర్షం కురవనంత వరకు మ్యాచ్ ఫలితం తేలే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

దివ్యాంగులకు మళ్లీ అగ్ని పరీక్ష

- సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్
- తాజాగా ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- అపీల్ చేసుకున్న దివ్యాంగులకు పరీక్షలు



ఆందోళన చేస్తున్న దివ్యాంగులు (ఫైల్)

మహారాణిపేట: దివ్యాంగులపై కూటమి ప్రభుత్వం కక్షగట్టింది. వీరిపై కనికరం లేకుండా పరీక్షల పేరుతో అష్టకష్టాలు పెడుతోంది. ఇప్పటికే 1,178 మంది దివ్యాంగుల పెన్షన్లు తొలగించాలని జాబితాను సిద్ధం చేసింది. దీనిపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమైంది. వివిధ కేటగిరీల్లో ఉన్న దివ్యాంగులు పింఛన్ల అపీల్ చేసుకోవడంతో వారికి గత నెల పింఛన్లు మంజూరు చేసింది. దివ్యాంగుల పింఛన్లలో భారీగా కోత విధించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం తాజాగా కఠిన నిర్ణయం తీసుకుంది. అపీల్ చేసుకున్న దివ్యాంగులకు మళ్లీ పరీక్షలు చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వైద్యుల ప్యానెల్‌ను ఏర్పాటు చేసి, బుధ, గురు, శుక్రవారాల్లో నగరంలోని నిర్దేశిత ఆస్పత్రుల్లో సర్టిఫికెట్లను వెరిఫై చేయాలని ఆదేశించడం.. దివ్యాంగుల వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.

ఆందోళనలో అభాగ్యులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తమ పింఛన్లకు ఎప్పుడు ఎసరు వస్తుందోనన్న భయాందోళనతో దివ్యాంగులు కాలం వెళ్లదీస్తున్నారు. రీవెరిఫికేషన్ పేరుతో ప్రభుత్వం తమ జీవితాలతో చెలగాటం ఆడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పునఃపరిశీలనలో తమ వైకల్య శాతాన్ని తగ్గిస్తారేమోనని, లేదా సర్టిఫికెట్‌ను పూర్తిగా రద్దు చేస్తారేమోనని మదనపడుతున్నారు. అనారోగ్యం లేదా ఇతర కారణాలతో వెరిఫికేషన్‌కు హాజరు కాలేకపోతే మరుసటి నెల నుంచే పింఛన్ కట్ చేస్తుండటంతో ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారు. మంచానపడిన వారిని, మానసిక వికలాంగులను సైతం వదలకుండా నోటీసులు జారీ చేసి ఇబ్బందులకు గురిచేయడం ప్రభుత్వ కనికరలేని వైఖరికి నిదర్శనమని వారు వాపోతున్నారు.

ఏరివేతే లక్ష్యంగా..

దివ్యాంగుల పింఛన్ల లబ్ధిదారుల సంఖ్యను తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ర్యాండమ్ సర్వేలు, మంచం మీద ఉన్నవారికి ఇంటివద్దకే వెళ్లి రీవెరిఫికేషన్లు నిర్వహించారు. ఇప్పుడు 50 శాతం లోపు వైకల్యం ఉన్నవారికి, గతంలో పింఛన్ నిలుపుదలపై అప్పీల్ చేసుకున్న వారికి మళ్లీ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటికే జిల్లాలో 1,178 మంది పింఛన్లను తొలగించేందుకు జాబితా సిద్ధం చేయడం ప్రభుత్వ ఉద్దేశాన్ని స్పష్టం చేస్తోంది. వ్యతిరేకత రావడంతో గత నెల పింఛన్లు విడుదల చేసినప్పటికీ, ఇప్పుడు మళ్లీ పరీక్షల పేరుతో వారిని వేధించడం దారుణం.

కక్షసాధింపు తగదు

జిల్లాలో మొత్తం 21,306 మంది దివ్యాంగుల పింఛనుదారులు ఉండగా, ఇప్పటికే 16,187 మంది రీవెరిఫికేషన్ పూర్తయింది. ఇంకా 5,119 మందికి ఈ ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. పరీక్షలు చేసిన వారిలో 1,178 మంది దివ్యాంగుల పింఛన్లకు ఎసరు వచ్చింది. వీరికి కేజీహెచ్, అగనంపూడి ఆస్పత్రి, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, ఈఎన్‌టీ ఆస్పత్రుల్లో ప్రతి బుధ, గురు, శుక్రవారాల్లో వైద్యుల బృందం సదరం సర్టిఫికెట్లను పరిశీలన చేయనుంది. పుట్టుకతోనే వైకల్యంతో బాధపడుతూ, మరొకరి సాయం లేనిదే కదలలేని అభాగ్యులపై ప్రభుత్వం ఇలా కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం అమానవీయమని, ఈ రీవెరిఫికేషన్ నిబంధనలు తమకు శాపంగా మారాయని దివ్యాంగులు కన్నీరుమున్నీరవుతున్నారు.

ఎన్-బ్రాండ్‌తో ప్రజల ప్రాణాలకు ముప్పు

- కల్తీ మద్యంపై వైఎస్సార్‌సీపీ మహిళల ధర్నా
- ఎక్సైజ్ కార్యాలయం వద్ద బాటిళ్లు ధ్వంసం

బీచ్‌రోడ్డు: రాష్ట్రంలో 'నారా వారి సారా', 'ఎన్ బ్రాండ్ లిక్కర్' తాగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని.. అటువంటి కల్తీ మద్యంను తక్షణమే అరికట్టాలని వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కల్యాణి ఆదేశాల మేరకు బుధవారం సిరిపురంలోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయం వద్ద కల్తీ మద్యానికి వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళా నాయకురాళ్లు మద్యం బాటిళ్లను ధ్వంసం చేసి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అనంతరం పేడాడ రమణికుమారి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో లేని మద్యం కల్తీ ఉందని ప్రచారం చేసిన కూటమి ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన తర్వాత కల్తీ మద్యం వ్యాపారాన్ని విచ్చలవిడిగా కొనసాగిస్తోందని మండిపడ్డారు. కల్తీ మద్యం వ్యాపారం చేస్తూ పట్టుబడిన టీడీపీ నాయకులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ ప్రభుత్వంలో మొదటి నుంచి ఇటువంటి కల్తీ మద్యం వ్యాపారాలు, లిక్కర్ స్కాములు సర్వసాధారణమని ఆమె ఆరోపించారు. 2014-19 మధ్యలో కూడా వేల కోట్లకు పైగా లిక్కర్ స్కామ్‌కు టీడీపీ ప్రభుత్వం పాల్పడిందన్నారు. ప్రస్తుతం దానికి మించి లిక్కర్ స్కామ్ జరుగుతోందని, ఇటీవల పట్టుబడిన కల్తీ మద్యం తయారీ కేంద్రమే ఇందుకు నిదర్శనమన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి స్కామ్‌లు లేకపోయినా.. అక్రమంగా తమ పార్టీకి చెందిన పలువురిని అరెస్టు చేసి ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేశారన్నారు. అయితే న్యాయం తమ వైపే ఉంది కాబట్టి కోర్టుల ద్వారా వారు విముక్తి పొందారని రమణికుమారి గుర్తుచేశారు. మహిళల తాళి బొట్టులతో ఆటలాడుతున్న కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లే అనురాధ, రాష్ట్ర అధికార ప్రతినిధి మంచా నాగమల్లేశ్వరి, సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు రాధ, కార్పొరేటర్ శశికళ, జిల్లా అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు శ్రీదేవి వర్మ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, నాయకులు భాను, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, తూర్పు, దక్షిణ, గాజువాక మహిళా విభాగం అధ్యక్షులు శిరీష, బంగారమ్మ, పల్లా చిన్నతల్లి, టీచర్స్ విభాగం ప్రతినిధులు కల్పన, జ్యోతి, పద్మావతి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

అవమానం భరించలేక యువతి ఆత్మహత్య

పీఎంపాలెం: నలుగురిలో చేయి చేసుకోవడంతో పాటు, అక్రమ సంబంధాన్ని అంటగట్టి దూషించడాన్ని అవమానంగా భావించిన ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. పెదరుషికొండలో బుధవారం చోటు చేసుకున్న ఈ విషాద ఘటనకు సంబంధించి.. పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ అందించిన వివరాలివి. శ్రీకాకుళం జిల్లా, సంతబొమ్మాళి మండలం, సూరాడవానిపేటకు చెందిన కొమర బాబూరావు అక్కడ తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. అతని కుమార్తె భవానీ (19) పెదరుషికొండ, స్వర్ణ భారతీ నగర్‌లోని మేనమామ సూరాడ గణేష్ ఇంటి వద్ద ఉంటూ, నగరంలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. గణేష్, అతని భార్య మాధవి దసరా పండగ సందర్భంగా ఇటీవల స్వగ్రామం వెళ్లారు. అతనికి పెదరుషికొండలో కిళ్లీ బడ్డీ ఉండగా, ఆ వ్యాపారాన్ని అప్పటి నుంచి భవానీయే చూసుకుంటోంది. మేనమామ ఇంటి దిగువ పోర్షన్‌లో కనకరాజు, అతని భార్య సంధ్యారాణి నివసిస్తున్నారు. భవానీ తన భర్త కనకరాజుతో రహస్యంగా మాట్లాడుతోందని సంధ్యారాణి అనుమానించింది. అంతే కాకుండా బుధవారం రోడ్డుపై వెళుతున్న భవానీని అటకాయించి, 'నా భర్తతో ఎందుకు మాట్లాడుతున్నావు?' అంటూ నిలదీసి, చెంపపై కొట్టింది. అందరిలో భవానీని పలువిధాలుగా దూషించింది. ఈ సంఘటనను తీవ్ర అవమానంగా భావించి, మనస్తాపం చెందిన భవానీ ఇంటికి వెళ్లి ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఎస్ఐ సునీత దర్యాప్తు చేస్తున్నారని సీఐ తెలిపారు.

మంచి టీచర్లుగా పోటీ పడి పనిచేయండి

నూతన ఉపాధ్యాయులకు కలెక్టర్ హితబోధ



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్



హాజరైన నూతన ఉపాధ్యాయులు

మహారాణిపేట: ఆదర్శ ఉపాధ్యాయులుగా నిలిచేందుకు, విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు పోటీపడి పనిచేయాలని నూతన ఉపాధ్యాయులకు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ హితబోధ చేశారు. మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు మధురవాడ ఐటీ హిల్స్‌లోని శ్రీకళాశ్ విద్యా సంస్థలో వారం రోజుల పాటు ఏర్పాటు చేసిన ఇండక్షన్ ట్రైనింగ్ శిబిరాన్ని బుధవారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి పలు విషయాలపై మాట్లాడారు. ఎంతో కష్టపడి ప్రభుత్వ కొలువు సాధించడం అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో మంచి ఉపాధ్యాయులుగా ఉండేందుకు కష్టపడి పని చేయాలన్నారు. శిక్షణ కాలంలో ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా ఆకళింపు చేసుకోవాలన్నారు. క్రమశిక్షణతో, వృత్తిని ప్రేమిస్తూ పని చేస్తేనే ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ అలవర్చుకొని, బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలన్నారు. ఆధునిక బోధనా పద్ధతుల గురించి తెలుసుకొని ఆచరణలో పెట్టాలన్నారు. సిలబస్, టైమ్ టేబుల్ ప్రకారం పాఠం చెప్పామనే కాకుండా, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. బడికి రావాలనే కుతూహలాన్ని విద్యార్థుల్లో కల్పించాలన్నారు. మీ జీవితంలో బాగా పాఠం చెప్పిన గురువులను ఇప్పటికీ ఎలా గుర్తుంచుకుంటారో.. అదే మాదిరిగా మిమ్మల్ని మీ విద్యార్థులు కూడా గుర్తుంచుకునేలా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్ కుమార్, సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, శిక్షకులు పాల్గొన్నారు.

నేడు సుఖీ సురక్ష ప్రారంభం

దాబాగార్డెన్స్ : పట్టణ ప్రాంతంలో స్వయం సహాయక సంఘ మహిళల ఆరోగ్యం, సామాజిక ఆర్థిక శ్రేయస్సును మెరుగు పరచడానికి మెప్మా ఆధ్వర్యంలో ఈ నెల 9న ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో సుఖీ సురక్ష కార్యక్రమం ప్రారంభించనున్నట్లు జీవీఎంసీ యూసీడీ పీడీ సత్యవేణి పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు దీర్ఘకాలిక, జీవనశైలి, మానసిక ఆరోగ్య స్థితి ముందస్తుగా గుర్తించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని కాపాడడం కోసం ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు.

పెల్లుబికిన ప్రజాగ్రహం



ప్రజా సంఘాల నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు



నినాదాలతో హోరెత్తిస్తున్న మహిళలు



గో బ్యాక్ అంబుజా సిమెంట్స్ అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నాయకులు



కుర్చీలు విసిరేస్తూ.. తమ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ఆందోళన కారులను అరెస్టు చేస్తున్న పోలీసులు

పెదగంట్యాడ: సిమెంట్ పరిశ్రమ కాలుష్యం బారిన పడి అనారోగ్యం పాలవుతామంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ వద్దంటూ చేస్తున్న ఆందోళనలను.. అధికారులు, పాలకులకు వినతులు అందజేసినా పట్టించుకోకుండా ప్రజాభిప్రాయ సేకరణకు పూనుకోవడంతో ఆగ్రహంతో రగిలిపోయారు. కాలుష్యం కాటేస్తుందని ఒడిశా వాసులు తరిమికొట్టేసిన ఫ్యాక్టరీ తమ ప్రాణాలు కంటే ముఖ్యం కాదని స్పష్టం చేశారు. దీంతో గంగవరం పోర్టు ఆధ్వర్యంలో అంబుజా సిమెంట్స్ గ్రైండింగ్ కోసం బుధవారం 75వ వార్డు పరిధిలోని జీవీఎంసీ మైదానంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ రసాభాసగా మారింది. మహిళలు, పిల్లలు, పెద్దలు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు తరలివచ్చి అంబూజా సిమెంట్స్ గో బ్యాక్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి ఆర్డీవో శ్రీలేఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ ముకుందరావు, పెదగంట్యాడ తహసీల్దార్ పి.అమల హాజరయ్యారు. ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో 11.30 గంటల సమయంలో కార్యక్రమాన్ని ముగించడంతో అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

అడ్డుకున్న నాయకులు, ప్రజా ప్రతినిధులు..

ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకునేందుకు జనంతో పాటు ప్రజా సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు సైతం అక్కడకు చేరుకున్నారు. డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్, కార్మిక సంఘాల నాయకులు మంత్రి రాజశేఖర్, ఆదినారాయణ, సీపీఐ నాయకుడు కసిరెడ్డి సత్యనారాయణ, కార్పొరేటలు ఏజే స్టాలిన్, పులి లక్ష్మీబాయి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి,గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, మార్టుపూడి పరదేశి, మంత్రి శంకరనారాయణ, ధర్మాల శ్రీను, గొందేశి వెంకటరమణారెడ్డి, కొయ్య భారతి, మధుసూదన్ రెడ్డి, సుమన్ రెడ్డి, గుడివాడ లతీష్ తదితరులు ప్రజలతో కలిసి కార్యక్రమాన్ని అడ్డుకున్నారు.

3 గంటల తర్వాత.. : మధ్యాహ్నం 3 గంటల తర్వాత ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని మళ్లీ మొదలు పెట్టారు. ఆ ప్రాంతం చుట్టూ పోలీసు బలగాలను మోహరించారు. దీంతో గంగవరం పోర్టులో పని చేస్తున్న కార్మికులతో అభిప్రాయ సేకరణ చేపట్టారని సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో మళ్లీ ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు అక్కడకు చేరుకునే ప్రయత్నం చేశారు. అయితే నాయకులతో పాటు ఆందోళన కారులను పోలీసులు అరెస్టు చేశారు. ఉద్రిక్తతల నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పెదగంట్యాడ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని నాయకులతో సమావేశమయ్యారు. వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయితే నాయకులు ససేమిరా అనడంతో ప్రజాభిప్రాయసేకరణను వాయిదా వేశారు. మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తామన్న విషయాన్ని త్వరలోనే వెల్లడిస్తామని ప్రకటించారు. అప్పుడు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

పల్లా యూటర్న్

- ప్రజాభిప్రాయమే నా నిర్ణయం
- ప్రజలు సిమెంట్ ఫ్యాక్టరీని వ్యతిరేకిస్తున్నారు
- అంబుజా ఫ్యాక్టరీపై పల్లా కామెంట్స్

గాజువాక: పెదగంట్యాడలో అదానీ గ్రూప్‌నకు సంబంధించిన అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు వ్యతిరేకంగా కొన్ని రోజులుగా స్థానిక ప్రజలు ఆందోళనలు చేస్తున్నా, నిరసనలు తెలుపుతున్నా స్పందించని స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు.. ప్రజా వ్యతిరేకత ఉవ్వెత్తున ఎగసిపడడంతో ఎట్టకేలకు స్పందించారు. అధికారులు బుధవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలు ఏకతాటిపై నిలిచి అడ్డుకోవడంతో, వారి ఆగ్రహాన్ని గమనించి ఆయన తన వైఖరి మార్చుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. 'నేను ప్రజల మనోభావాలకు అనుగుణంగానే నడుచుకుంటాను'అంటూ కొత్త పల్లవి అందుకున్నారు. ప్రజల వైపేనంటూనే, ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని సుతిమెత్తగా సెలవివ్వడం ఆయన ద్వంద్వ వైఖరికి అద్దం పడుతోంది. 'ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రజలు అనుకూలంగా ఉంటే ముందుకు వెళ్లాలి. లేని పక్షంలో ముందుకు వెళ్లొద్దు. ప్రజాభిప్రాయ సేకరణ జరగనివ్వబోమని చెప్పడం కరెక్టు కాదు.. ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు తమ మనోభావాలను చెప్పాలి. కంపెనీలు పెట్టే ముందు కూడా అక్కడున్న ప్రజలకు దాని వల్ల కలిగే ప్రయోజనాలను వివరించడంతో పాటు పొల్యూషన్ వంటి అంశాలపై అవగాహన కల్పించాల్సి ఉంది. అలాంటి కార్యక్రమాలు లేకుండా నేరుగా ప్రజాభిప్రాయసేకరణ చేపడితే ఇలాంటి సమస్యలే ఎదురవుతాయి. ప్రజలకు ఇష్టం ఉంటేనే ముందుకు వెళ్లాలి.. ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడం ప్రజలకు ఇష్టం లేకపోవడంతో వ్యతిరేకించారు'అని పల్లా పేర్కొన్నారు. మొత్తం మీద రోజుల తరబడి జరుగుతున్న ఆందోళనలను గాలికి వదిలేసి, ప్రజల ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకున్నాకే 'ప్రజాభిప్రాయమే నా నిర్ణయం'అని పల్లా శ్రీనివాసరావు ప్రకటించడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. ఇది ప్రజల మీద ప్రేమతో వచ్చిన మార్పు కాదని, ప్రజా వ్యతిరేకతకు భయపడి తీసుకున్న రాజకీయపరమైన యూ-టర్న్ అని పలువురు విమర్శిస్తున్నారు.